
ఉద్వేగంగా స్విచ్ నొక్కింది అరుంధతి. లోపల బెల్ మోగుతోంది. కానీ తలుపు తెరుచుకోలేదు. క్షణం ఆగి "అప్పూ! అప్పూ!" అని అరుస్తూ తలుపు దబదబ బాదాడు రంగనాథ్.

తలుపు తెరిచిన అపూర్వ ఎదురుగా ఉన్న తల్లిదండ్రుల్ని చూసింది. ఆమె ముఖంలో ఆశ్చర్యంగాని, ఆనందంగాని కనిపించనే లేదు. ఒక్క మాట కూడా మాట్లాడకుండా చిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది. నిర్ఘాంతపోయారు తల్లిదండ్రులు. అపూర్వకు పెళ్లిచేసి, కాపురానికి పంపి ఆరునెలలు దాటినా ఆమె నుంచి ఒక్క ఉత్తరంగాని, ఫోన్‌కాల్‌గానీ లేకపోవడంతో బెంగపడి వస్తే దాని ప్రవర్తన ఇది! ఇష్టంలేని పెళ్లి చేసినందుకు అమ్మాయి కోపం ఇంకా తగ్గలేదన్న మాట!

లోనికి రమ్మని అమ్మాయి ఆహ్వానించకపోయినా లోనికి వెళ్లారు ఇద్దరూ.



ఖరీదైన హంగులతో పెద్ద హాలు. దానిని ఆనుకొని ఒకవైపు బెడ్‌రూమ్‌లు. అటు ప్రక్క కిచెన్, డైనింగ్‌రూమ్ కాబోలు.

ఏ గదిలోకి వెళ్లాలో, ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తూ అలాగే ఉండిపోయారు రంగనాథ్ దంపతులు.

రక్షించే దేవతలాగ ఒకామె వచ్చి పరిచయం చేసుకుంది. "నేను రాధ. హౌస్‌కీపర్‌ని. ఆ గది అయ్యగారిది. ఇది మేడమ్‌గారిది. మీరు ఆ మూడో గదిలో ఉండవచ్చు" అంటూ లగేజి అందుకుని ఆ గది వైపు నడిచింది.

చల్లగా, హాయిగా ఏసీ గది. కానీ వారి హృదయాలే అల్లకల్లోల కొలిమి!

అయ్యగారి బెడ్‌రూమ్... మేడమ్‌గారి బెడ్‌రూమ్... ఆ మాటలే చెవిలో మోగుతూ గుండెల్ని పొడుస్తున్నాయి. అయితే వాళ్లు కలిసి ఉండడంలేదా? అమ్మాయి తిక్కతిక్కగా తన కాపురంలో తనే నిప్పులు పోసుకుంటున్నదా?

బ్యాగ్‌లోంచి రెండు స్టీలు డబ్బాలు తీసి, భర్తను రమ్మని సైగచేసి రెండో బెడ్‌రూమ్‌లో ప్రవేశించి, "ఎలా ఉన్నావ్ అప్పూ! ఉత్తరంలేదు, ఫోన్‌లేదు... ఎంత తల్లడిల్లిపోయామో తెలుసా? ఉండబట్టలేక నిన్ను చూడాలని వచ్చేసాం. ఇదిగో, నీకిష్టమని సున్నుండలు, కజ్జికాయలూ చేసి తెచ్చాను" డబ్బాలు టీపాయ్‌మీద పెడుతూ అంది అరుంధతి. డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని లిప్‌స్టిక్ సవరించుకుంటున్న అపూర్వ తల వెనక్కి తిప్పి –


"హాయిగా ఉండక చస్తానా? రోజూ మూడు లీటర్ల హాయి జుర్రుకుని తాగుతున్నా!" పాము బుసకొట్టినట్లు అంటూ చేతిలోని రిమోట్ నొ

ప్రఫుల్లచంద్ర

క్కింది.

ఎక్కడో బజర్ మోగిన శబ్దం. వెంటనే వచ్చింది రాధ.

అమ్మవైపుగాని, అమ్మ ప్రేమతో తెచ్చిన స్వీట్స్ వైపు గానీ చూడనైనా చూడకుండా ఆ స్వీట్స్‌ని పనివాళ్లంతా పంచుకోమని రాధకి చెప్పి, తను డ్రెస్ మార్చుకోవడానికి యాంటీ రూమ్‌లోకి వెళ్లిపోయింది అపూర్వ. అమ్మ మనసు విలవిలలాడిపోయింది. అమ్మాయి కాఠిన్యానికి తనే కారణం అని రంగనాథ్ కుమిలిపోయాడు.



ఔను... తనే కారణం!

ఎంసీఏ పాసైన తర్వాత అపూర్వ తను విక్రమ్‌ని ప్రేమించానంది. కులం, అంతస్తు, ఆస్తి అంటూ తను తీవ్రంగా వ్యతిరేకించడమే కాక రొటీన్ విలన్‌లాగా అతనికి వ్యతిరేకంగా అబద్ధాలు చెప్పి, రౌడీల చేత అతడిని కొట్టించాడు. అమ్మాయిని తిట్టాడు, కొట్టాడు. గదిలో నిర్బంధించాడు. బెంగుళూరులో ఐటి కంపెనీలో పనిచేస్తున్న తేజాతో బలవంతంగా పెళ్లి చేసాడు.

తర్వాత అపూర్వ తల్లిదండ్రులతో మాట్లాడనే లేదు. అత్తవారింట ఆమెను దిగబెట్టి వెళ్లిపోతున్నపుడు కూడా ఆమె వాళ్లతో మాట్లాడలేదు. కొద్దికాలానికి అంతా సర్దుకుంటుందిలే అనుకున్నాడు రంగనాథ్.

కానీ ఆమె కాపురానికి బెంగుళూరు వెళ్లి ఆరు నెలలు గడిచినా ఉత్తరంగాని, ఫోన్‌గానీ లేకపోవడంతో ఆలోచనలో పడి ఆత్రంగా వస్తే అమ్మాయి ప్రవర్తన ఇదీ!

ఆమె తననింకా క్షమించలేదన్నమాట!

తప్పు చేసానా? అని మొదటిసారి అనుకున్నాడు రంగనాథ్.

"మీరు మీ గదికి వెళ్లి రిలాక్స్ అవండమ్మా!" వినతిలాగా ఆర్డర్ జారీచేసి స్వీట్ డబ్బాలు తీసుకుని వెళ్లిపోయింది రాధ.

కథా నిలయం శ్రీకాకుళం

మౌనంగా, గంభీరంగా తమకు కేటాయించిన గదిలోకి వెళ్లి అటాచ్డ్ బాత్‌రూమ్‌లో స్నానం చేయగానే టిఫిన్ రెడీ అంటూ వాళ్లని డైనింగ్ రూమ్‌కి తీసుకెళ్లింది రాధ. అక్కడ అమ్మాయి, అల్లుడూ తమకోసం ఎదురుచూస్తూ ఉంటారని ఊహించిన ఆ దంపతులకు ఆశాభంగమే ఎదురైంది.

టిఫిన్‌చేసి వాళ్లిద్దరూ ఆఫీసుకెళ్లిపోయారని రాధ చెప్పగా అమ్మాయి ఉద్యోగం చేస్తున్నట్లు ఇంతవరకూ తెలియని రంగనాధ్ దంపతుల హృదయం చివుక్కుమంది. ఆఫీసునుంచి వాళ్లు వచ్చేసరికి రాత్రి ఏడు అవుతుందట.

ఇక చేసేదేముంది? నిరీక్షించడం తప్ప!

భార్య కళ్లలో గిజగిజలాడుతున్న కన్నీటిని చూసి చలించిపోయాడు రంగనాధ్. 'అమ్మాయి ప్రేమను అంగీకరించవలసింది. తప్పు చేసాను, తప్పుచేసాను' అని కుమిలిపోయాడు.

మౌనంగా టిఫిన్ చేసి తమ గదిలో కాసేపు కూర్చున్నారు. తర్వాత హాలులో కూర్చుని కాసేపు టీవీ చూసారు. ఆ తర్వాత ఇంటి చుట్టూ వున్న గార్డెన్‌లో తిరిగారు. అందరికీ ఆహ్లాదాన్నిచ్చే బెంగుళూరు గులాబీలు వాళ్లని అలరించలేకపోయాయి. నీరసంగా ఇంటిలోకి వచ్చి అల్లుడి బెడ్‌రూమ్‌లో ప్రవేశించారు.

టేబుల్ మీద ఉన్న ఫొటో చూడగానే వారి గుండెలు ఝల్లుమన్నాయి. ఒక యువతితో అల్లుడు సన్నిహితంగా ఉన్న ఫొటో అది. ఫోజు చూస్తే ఆ అమ్మాయి అతని ఫ్రెండ్‌కాదు, సోదరి కాదు, ఖచ్చితంగా లవర్ అనిపిస్తోంది. వారి హృదయాలు వికలమయ్యాయి. కూతురు, అల్లుడూ అన్యోన్యంగా లేరా?! అతనికి వేరే స్త్రీతో సంబంధం ఉందా?

ఈలోగా రాధ వచ్చేసింది. పర్మిషన్ లేకుండా అయ్యగారి గదిలోకి వెళ్లకూడదని గదమాయించి వాళ్లని తరిమేసినంత పనిచేసింది.

రాధని ఎన్నో విషయాలు అడగాలనిపించినా ఇంటిగుట్టు పనిమనిషి ద్వారా లాగడం మర్యాదకాదని ఏమీ అడగకుండానే తమ గదిలోకి వచ్చేసారు.

బెడ్‌మీద రంగనాధ్. సోఫాలో అరుంధతి. ఎవరి ఆలోచనలు వారివి! ఎవరి బాధ వారిది!

* * *

రాత్రి ఏడుగంటల నుంచి కూతురు, అల్లుడూ వస్తారు కదా అని ఎదురుచూస్తూ కూర్చున్నారు రంగనాధ్ దంపతులు.

ఫోన్ మోగింది. రాధ అందుకుని విన్నది. తరువాత ఫోన్ పెట్టేస్తూ –

"అమ్మా ఆఫీసు పనిమీద అయ్యగారు, మేడమ్ చెన్నయ్ వెళ్తున్నారట. రేపు ఉదయం మీ కోసం కారు వస్తుందట. పదిగంటలకు మీకు ట్రెయిన్ ఉందట" అని చెప్పింది.

అంటే... పది గంటల ట్రెయిన్‌లో ఊరికి పొమ్మనా?!

నిర్ఘాంతపోయారు దంపతులు.

* * *

బెంగుళూరు నుంచి ఇంటికి వచ్చేసినా అరుంధతి ఆ షాక్ నుంచి తేరుకోలేదు. ప్రియమైనదేదో పోగొట్టుకున్నట్లు శూన్యంలోకి చూస్తూ మౌనంగా ఉండిపోతోంది. మగాడు కాబట్టి రంగనాధ్ యాంత్రికంగా ఆఫీసుకెళ్లి వస్తున్నాడు గానీ గుండె గాయం ఆయన్ని కూడా లోలోన తొలిచివేస్తున్నది.

అలా ఆరు నెలలు గడిచాక – అపూర్వ పెళ్లిరోజున ఆ విషయాలు తలచుకొని, తలచుకొని అరుంధతి స్పృహతప్పి పడిపోయింది.

"బీపీ ఎక్కువగా ఉంది. బాధించే ఆలోచనలు కట్టిపెట్టి మందులు వాడుతూ పదిరోజులు బెడ్‌రెస్ట్ తీసుకుంటే చాలు" అని చెప్పి డాక్టర్ వెళ్లిపోయాడు.

కానీ హృదయాన్ని తొలిచేసే ఆలోచనల్ని అదుపు చేయడం సాధ్యమేనా?

దినదినమూ మనోవ్యాధితో కృశించిపోతున్న అరుంధతి నోట క్షణక్షణమూ రెండే మాటలు... "అప్పూ! క్షమించవే! అప్పూ! క్షమించవే!"

ఎన్ని మందులు వాడినా గుణం కనిపించక పోవడంతో అపూర్వని రప్పించడమే సరియైన మందు అన్నాడు డాక్టర్.

బెంగుళూరు వెళ్లి అల్లుడిని కలిసాడు రంగనాధ్. ఫొటోలో కనిపించిన అమ్మాయితో ఇప్పుడు అతగాడు కులుకుతున్నాడు. ఇంట్లో అపూర్వ జాడ లేదు.

"అప్పూ ఎక్కడ?" అడిగాడు.

"ఇదిగో అప్పూ... నా భార్య!" ఆ అమ్మాయిని చూపించి అన్నాడు తేజ.

రంగనాధ్‌కి చిర్రెత్తింది. "మా అమ్మాయి ఎక్కడ?" గద్దించాడు.

"ఏమో, ఎక్కడకు పోయిందో!" నిర్లక్ష్యంగా అన్నాడు తేజ.

ఆగ్రహంతో ఊగిపోయాడు రంగనాధ్. "రాస్కెల్! మా అమ్మాయిని వదిలి మరోదానితో కులుకుతున్నావా? నిన్ను కోర్టుకీడ్చుతా! ఉరికంబం ఎక్కిస్తా!"

"చేతనైంది చేసుకోండి!" నిశ్చింతగా అన్నాడు తేజ. అతని నిర్లక్ష్యం అయన పుండు మీద కారం చల్లింది. అల్లుడిని తిట్టిపోసి విజయవాడ కొచ్చేసి భార్యకి చెప్పాడు. అంతే... ఆమెకు హార్ట్ ఎటాక్!

* * *

ముక్కుకి ఆక్సిజన్ గొట్టం, చేతికి సెలైన్ గొట్టం, ఛాతీకి మోనిటర్ గొట్టం... శరీరం నిండా గొట్టాలతో హృదయవిదారకంగా ఆస్పత్రి బెడ్‌మీద పడిఉంది అరుంధతి. అంతలో శూన్యంలోకి ఎగిరిపోతున్న ఆమె ప్రాణాల్ని పట్టి వెనక్కి లాక్కువచ్చింది ఒక పిలుపు.

శక్తి అంతా కూడదీసుకుని కళ్లు తెరిచింది అరుంధతి. ఎదురుగా పెదవులు కదుపుతున్న ఒక అస్పష్ట స్త్రీ రూపం... "అమ్మా! అమ్మా!!"

అరుంధతి చేతులకు బలం వచ్చింది. కళ్లు నులుముకుని చూసి గుర్తించింది. ఉద్వేగంగా లేచి కూర్చుని, గొట్టాలు పీకిపారేసి "అమ్మా! నా తల్లీ! అప్పూ! వచ్చేసావా?" అంది ఆర్తిగా. అమ్మను హృదయానికి హత్తుకుని, కన్నీళ్లు తుడిచి, ముంగురులు సవరించింది అపూర్వ.

పాలిపోయిన అమ్మ పెదవుల మీద శుష్క దరహాసం మెరిసింది. కూతురు శరీరాన్ని తడిమి తడిమి చూసుకుని హృదయానికి మరింత బలంగా హత్తుకుంది. ఆమె క్షేమంగానే ఉందన్న వాస్తవం హృదయాన్ని తాకగా ఎక్కడలేనీ శక్తీ వచ్చేసిందా కన్నతల్లికి. "నామీద కోపం పోయిందామ్మా?" ఆర్ద్రంగా అడిగింది.

"నీమీద నాకెప్పుడూ కోపం లేదమ్మా!" అపూర్వ అంటూ ఉండగానే రంగనాధ్ వచ్చి కూతుర్ని చూసి ఆశ్చర్యపోయాడు. అల్లుడామెను ఏమీ చేయలేదన్న భావన స్వాంతన కలిగించినా ఇంతకాలం ఆమె ఎక్కడ ఉన్నట్లు? ఏం చేస్తున్నట్లు? అమ్మ అనారోగ్యం గురించి ఆమెకెలా తెలిసిందని గుంజాటనపడ్డాడు.

వారి ఆలోచనలకు సమాధానంగా తన కథ

చెప్పుకొచ్చిందామె.

* * *

పెళ్లయాక... తొలిరేయి...

శోభనం గదిలో ఆత్రంగా నిరీక్షిస్తున్న తేజాకి తన ప్రేమ కథ అంతా చెప్పేసి "మీతో సహజీవనం చేయలేను. మీ జీవితాన్ని నాశనం చేయలేను" అంది అపూర్వ.

షాక్ అయిన తేజ ఆవేశపడలేదు, కోపగించుకోలేదు. షాక్ నుంచి తేరుకుని ఏం చేద్దామని అడిగాడు గంభీరంగా.

అతని ప్రక్కనే మంచంమీద కూర్చుంటూ మీరెవరినైనా ప్రేమించారా? అని అడిగింది.

ప్రేమ అవునో కాదో గానీ తన ఆఫీసులోనే పనిచేసే అపర్ణ అంటే అతనికిష్టం. ఆమెకూ అంతే. సినిమాలకు, హోటళ్లకూ కలిసి వెళ్లి కబుర్లు చెప్పుకునేవారు. ఆ ఇష్టం క్రమేపీ ప్రేమగా మారేదేమో. ఆమెను పెళ్లి చేసుకుంటానని అమ్మకు చెప్పాడు. ఆమె ఒప్పుకోలేదు. తర్వాత ఆ వ్యవహారం కటాఫ్ అయి అపూర్వతో పెళ్లి జరిగింది.

"ఇప్పుడామెను పెళ్లి చేసుకోవడం మీకు ఇష్టమేనా?" హఠాత్తుగా అడిగింది అపూర్వ. మళ్లీ షాక్ అయాడు తేజా. ఇప్పుడెలా కుదురుతుంది!

"మనం అపర్ణగారింటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో చర్చిద్దాం"

ఆమె చొరవకు దిగ్భ్రాంతిచెందాడు తేజా.

"మనం విడాకులు తీసుకుందాం. మీరు అపర్ణను పెళ్లిచేసుకుని సుఖంగా ఉండండి. మా నాన్న చేసిన తప్పిదానికి నేనే శిక్ష అనుభవించాలి. మీరు కాదు..." అని ఎంతగానో చెప్పి అతనిని ఒప్పించింది అపూర్వ.

> 1000 రకాల 'కిక్'లు తెలిసిన ఫైటర్ ఎదుట నేను భయపడను. కానీ ఒకే రకమైన 'కిక్'ని 1000 సార్లు ప్రాక్టీస్ చేసిన ఫైటర్‌కి భయపడతాను.
> – బ్రూస్‌లీ

అయితే అతడొక షరతు విధించాడు – నీ లవర్ విక్రమ్ నిన్ను పెళ్లిచేసుకోవడానికి అంగీకరిస్తేనే నేను నీకు విడాకులిచ్చి అపర్ణను పెళ్లి చేసుకుంటాను అని.

కాస్తంత చిత్తశుద్ధి, ఒకింత నేర్పు, అపారమైన ఓర్పు, కొంత సంభాషణా చాతుర్యం ఉంటే ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించవచ్చు.

అపూర్వ, తేజ కలిసి మొదట చెన్నయ్‌లో పనిచేస్తున్న విక్రమ్‌ని, తరువాత విజయవాడలో అతని తల్లిదండ్రుల్నీ కలిసి నానా అగచాట్లూ పడి వారిని ఒప్పించారు. తర్వాత అపర్ణ తల్లిదండ్రుల్ని ఒప్పించడం కష్టం కాలేదు.

మరికొద్ది కాలానికి విడాకులూ, రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహాలూ జరిగిపోయాయి. తేజ నుంచి ఒక అప్పూ దూరమైతే ఇంకొక అప్పూ దగ్గరైంది. ఎందుకంటే అపర్ణని కూడా అందరూ అప్పూ అనే పిలుస్తారు! విక్రమ్‌తో చెన్నయ్‌కి వెళ్లిపోయిన అపూర్వకు అక్కడే ఉద్యోగం దొరికింది.

రెండు జంటలూ స్నేహంగా ఉంటూ, ఫోన్‌లో మాట్లాడుకుంటూ రాకపోకలు సాగిస్తూ హాయిగా ఉన్నారు.

* * *

తనకు తెలియకుండా, తమ ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా తన కూతురు విడాకులు తీసుకుని, మళ్లీ పెళ్లి చేసుకున్నందుకు కుతకుతలాడిపోయాడు రంగనాథ్. ఆమెను చెడామడా

తిట్టాలనిపించింది. కానీ ఆమె వెళ్లిపోతే తన భార్య ప్రాణాలకే ముప్పు. అందుకని ఆరిపోయిన నిప్పుల కొలిమిలాగ కూతురు చెప్పిన కథ అంతా వింటూ కూర్చున్నాడు.

విడాకులు, మళ్లీ పెళ్లి గురించి పెద్దగా పట్టించుకున్నట్లు లేదు అరుంధతి. ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. "ఏమైతేనేం... సంతోషంగా ఉన్నావు కదా" అంది ఆర్తిగా కూతురు చేతిని హృదయానికి హత్తుకుంటూ.

"నేనెంతో హాయిగా ఉన్నానమ్మా! విక్రమ్ మాత్రమే కాదు అత్తమామలు కూడా నన్ను ప్రేమగా చూసుకుంటున్నారు" అపూర్వ స్వరంలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆ మందస్మిత వదనంతోనే - కొరకొరా చూస్తున్న తండ్రివద్ద కెళ్లిందామె.

"నాన్నా! బిడ్డల దృష్టిలో తల్లి ఒక దేవత. తండ్రి ఒక హీరో. తల్లిదండ్రులు ఏ తప్పూ చేయరు. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొంటారు. నీతి నియమాలు తు.చ. తప్పకుండా పాటించే ఋజువర్తనులు అని ప్రతి బిడ్డా భావిస్తుంది. కానీ ఆ తల్లిదండ్రులే తాము చెప్పే నీతుల్ని తామే ఉల్లంఘిస్తూ, అబద్ధాలాడుతూ మోసాలు చేస్తున్నపుడు బిడ్డలకు వారిమీద గౌరవం పోతుంది".

రంగనాథ్ తల వంచుకుని వింటున్నాడు. ఈ ఉపోద్ఘాతం ఎందుకో ఆయనకు అర్థం కాలేదు.

"నాన్నా! నిన్నొక హీరోగా భావించి ఆరాధించాను. ప్రేమించాను. గౌరవించాను. కానీ నా ప్రేమ విషయంలో నువ్వు విలన్‌వి అయ్యావు. నీతి తప్పావు. అబద్ధాలు చెప్పావు. విక్రమ్‌ని రౌడీలతో కొట్టించి, నన్ను తిట్టి, కొట్టి గదిలో నిర్బంధించి రాక్షసంగా ప్రవర్తించావు. నేనెందుకు నిన్ను గౌరవించాలో చెప్పు నాన్నా!"

ఆ ప్రశ్న బాణంలా హృదయాన్ని తాకి, విలవిలలాడిపోయాడు రంగనాథ్.

"మొదట తేజా మంచివాడన్నావ్. అతనికి నన్నిచ్చి పెళ్లిచేసావ్. తర్వాత అతడిని హంతకుడని భావించావు. అంటే నీ విచక్షణ మీద నీకే నమ్మకం లేదన్నమాట. అలాంటప్పుడు నా విచక్షణను ఎలా తప్పుపట్టగలవు నాన్నా?"

మరో బాణం ఆయన హృదయాన్ని ఛేదించింది.

"నేను చెప్పేది వినడానికే నీకు తీరిక లేకపోయింది. నన్ను కొట్టి, తిట్టి హింసించావు. విక్రమ్, అతని తల్లిదండ్రులు, అపర్ణ, ఆమె తల్లిదండ్రులు, తేజ, అతని తల్లిదండ్రులు నీకంటే ఎంతో గొప్పవారు నాన్నా! మా అభిప్రాయాలు విన్నారు. మంచిచెడ్డలు చర్చించారు. చివరకు ఒప్పుకున్నారు. నువ్వు నాశనం చేయబోయిన నా జీవితాన్ని వాళ్లు నిలబెట్టారు. మీరు బెంగుళూరుకు వచ్చినప్పటికే మేము విడాకులు తీసుకున్నాం. అప్పుడు మేము చెన్నయ్‌కి వెళ్లింది విక్రమ్‌తో చర్చించి, పెళ్లిరోజు నిర్ణయించడానికే. ఈ విషయాలు నీకు చెబితే నువ్వు రాక్షసంగా మరింత రభస చేసేవాడివి. నీతోబాటు నేను కూడా రాక్షసిగా మారడం ఇష్టంలేక అప్పుడు తప్పించుకుతిరిగాను. పెళ్లిచేసి అత్తారింటికి పంపిన తర్వాత కూడా నేను నీ ఆధీనంలోనే ఉండాలని, అన్నీ నీకు చెప్పి చేయాలనీ భావించడం నీ అహంకారం, అల్పబుద్ధి తప్ప మరొకటి కాదు నాన్నా" ఖంగుమంది అపూర్వ స్వరం.

రంగనాథ్ తల వాలిపోయింది.

"నేటి మహిళను నేను! నన్నెవ్వరూ ఆపలేరు!!" సగర్వంగా అనుకుంది అపూర్వ. ●